సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 14 । జూలై । 2023



పెద్దపులి సంచారం

సరియా జలపాతం పరిసరాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి రవివర్మ తెలిపారు. IIలో



గంజాయి కేసులో రిమాండ్

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు కోర్టు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. IIలో



ప్రకృతి సాగుతో దిగుబడులు

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని మత్స్యదేవత సాధికార సంస్థ సీఈవో హనుమంతరావు అన్నారు. IIలో

కస్తూర్బాలు హౌస్‌ఫుల్

- ప్రవేశ ద్వారాల వద్ద అడ్మిషన్లు ముగిశాయని బోర్డులు
- 19 కేజీబీవీల్లో 4,560మంది విద్యార్థినులకు ప్రవేశాలు
- ప్రవేశాల్లో డ్రాపౌట్లకు అధిక ప్రాధాన్యం



అడ్మిషన్లు ముగిసినట్టు హుకుంపేట కేజీబీవీ ప్రవేశ ద్వారానికి ఏర్పాటుచేసిన బోర్డు



కేజీబీవీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థినులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 కస్తుర్బాగాంధీ విద్యాలయాల్లో సీట్లు ఫుల్ అయ్యాయి. దీంతో అన్ని విద్యాలయాల వద్ద ప్రవేశాలు ముగిసినట్టు బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. కేజీబీవీల్లో గత రెండేళ్ల నుంచి టెన్త్,ఇంటర్‌లో మంచిఫలితాలువస్తున్నాయి. డ్రాపౌట్ ,అనాథ విద్యార్థినులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఈ విద్యాలయాలు పనిచేస్తున్నాయి. ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అందించే ఈ పాఠశాలల్లో ప్రతి తరగతికి 40సీట్లు ఉన్నాయి.ఇంటర్‌లోను ఏదో ఒక గ్రూప్‌లో 40సీట్లతోనే ఇంటర్‌విద్యను అందిస్తున్నారు.

ఫలించిన ముందస్తు ఆన్‌లైన్ ప్రక్రియ

సర్వశిక్ష, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్ నెల నుంచే కేజీబీవీల ఎస్‌వోలు,సీఆర్‌టీలు గ్రామాల బాట పట్టారు. జిల్లాలోని రంపచోడవరం, పాడేరు, చింతూరు డివిజన్ల పరిధిలోని అన్ని మండలాల్లోను ఆరవ తరగతి ప్రవేశాలతో పాటు పలు తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు తీసుకున్నారు.వివిధ కారణాలతో చదువుకు దూరంగా ఉన్న విద్యార్థినులను,తల్లిదండ్రులు లేని అనాథ బాలికలను గుర్తించి వారి ఆధార్ కార్డుల ఆధారంగా ఆన్‌లైన్ చేశారు.అలాగే 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించారు. టెస్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన బాలికలకు కూడా ఆన్‌లైన్ విధానంలోనే ప్రవేశాలు కల్పించారు.

కళకళలాడుతున్న పాఠశాలలు

జిల్లాలోని 19 కేజీబీవీల్లో 4,560 మందికి ఈఏడాది ప్రవేశాలు కల్పించారు. ప్రతీ తరగతిలో 40మంది విద్యార్థినులతో కేజీబీవీలన్నీ కళకళలాడుతున్నాయి. అదనంగా సీట్లు పెంచాలన్న డిమాండ్ ఉంది. ఇటీవల ప్రభుత్వం కేజీబీవీల్లో పూర్తిస్థాయిలో ప్రత్యేకాధికారులు,కాంట్రాక్టు లెక్చరర్లు,సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేయడంతో విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగుపడతాయని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయి సౌకర్యాలు



జిల్లాలోని 19 కేజీబీవీల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మూడు పూటలా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం.విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంతో అన్ని కేజీబీవీల్లోను బోధన సిబ్బంది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.ఈఏడాది కేజీబీవీల్లో ప్రవేశాలకు డిమాండ్ నెలకొనడం సంతోషంగా ఉంది.

– ఎస్.కె.సలీమ్‌బాషా, డీఈవో, పాడేరు

పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలు

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పీవో అభిషేక్, అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపలి రూరల్: గిరిజనులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కోరుకొండ ఆస్పత్రి నూతన భవనాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్,అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్‌తో కలసి ఆమె గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయకుండగా అసంపూర్తి నిర్మాణాలతో వదిలేసిన కోరుకొండ పీహెచ్‌సీ భవనాన్ని తమ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఈ పీహెచ్‌సీ వల్ల 65 గ్రామాల ప్రజలకు వైద్యసేవలందుతాయని చెప్పారు. బలపం పంచాయతీ పరిధిలోని 33 గ్రామాలు, తమ్మంగుల, కుడుముసారి పంచాయతీల పరిధిలో మరో 32గ్రామాల ప్రజలు కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యసేవలు పొందే అవకాశం కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూషదేవి, బోయిన కుమారి,జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,డీఎంహెచ్‌వో జమీల్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి,ఎంపీడీవో ఆశాజ్యోతీ, బలపం సర్పంచ్ కొర్రా రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీమండల కన్వీనర్ గనబాబు,గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాజంగిలో నిర్మిస్తున్న మ్యూజియం పనులను ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు.

ఒనకఢిల్లీలో బెల్జియం విద్యార్థుల సందడి

ముంచంగిపుట్టు: ఆంధ్ర –ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీలో గురువారం జరిగిన వారపు సంతలో బెల్జియం దేశానికి చెందిన 20 మంది విద్యార్థులు సందడి చేశారు.సంతకు వచ్చిన బొండా ఆదివాసీలతో కలిసి ఫొటోలు దిగారు.బొండా ఆదివాసీల వేషధారణ, సంస్కృతి,సంప్రదాయాలపై అధ్యయనం చేశారు.వారి గ్రామాల వివరాలు సేకరించారు.మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి,విద్యుత్ ఉత్పత్తిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇక్కడ బొండా జాతి గిరిజనుల సంప్రదాయాలు చాలా విచిత్రంగా ఉన్నాయని, వారి స్థితిగతులపై అధ్యాయనం చేస్తున్నామని బెల్జియం విద్యార్థులు తెలిపారు.



బొండా ఆదివాసీలతో బెల్జియం విద్యార్థులు

న్యూస్‌రీల్

నిలిచిన పాపికొండల పర్యాటకం

దేవీపట్నం: ప్రతికూల వాతావరణం కారణంగా గురు, శుక్ర వారాలు రెండురోజుల పాటు గోదావరిలో పాపికొండల పర్యాటక బోట్లను నిలిపివేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తరువాత ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎప్పుడు బోట్లు నడిపేదీ ప్రకటించనున్నారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్



ఘాట్‌రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

మారేడుమిల్లి : జిల్లాలోని మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో గురువారం ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోవడం ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఒడిశాకు చెందిన లారీ రాజమహేంద్రవరం నుంచి లోడ్‌తో ఒడిశాకు వెళ్తుండగా ఘాట్‌రోడ్డులోని వాలీసుగ్రీవు మలువు వద్ద సాంకేతిక లోపంతో రహదారికి అడ్డంగా అగిపోయింది. దీంతో ఇరువైపులా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ప్రయాణికులు వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నిలిచిపోయిని ట్రాఫిక్ సాయంత్రానికి క్లియర్ అయింది.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతపల్లిరూరల్: గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు.మండలంలో లోతుగడ్డ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆస్పత్రిలో రోగులు,గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారుల గృహాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో లోతుగడ్డ వైద్యాధికారి జానకి,ఆరోగ్య విస్తరణ అధికారి సింహాద్రి,సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి రాజవొమ్మంగి విద్యార్థి ఎంపిక



చరణ్‌తేజ్

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగికి చెందిన విద్యార్థి మిరియాల చరణ్‌తేజ్ ట్రిపుల్ ఐటీ (శ్రీకాకుళం)కి ఎంపికయ్యాడు. స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన చరణ్‌తేజ్ ఈ ఏడాది టెన్త్‌లో 565 మార్కులు సాధించాడు. జిల్లా స్థాయిలో మూడవ స్థానంలో నిలిచి ఆణిముత్యాల అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం చరణ్‌తేజ్ సామర్లకోట సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చరణ్‌తేజ్‌ను అభినందించారు.

కొత్తూరు కేజీబీవీ తనిఖీ



సూచనలిస్తున్న డీఈవో సలీంబాషా

అనంతగిరి: మండలంలోని కొత్తూరు కేజీబీవీని జిల్లా విద్యాశాఖ అధికారి సలీంబాషా గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మెనూ అమలుపై విద్యార్థినులను అడిగితెలుసుకున్నారు. అనంతరం స్టాక్, వంటరూమ్ తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థినులకు అర్థమయ్యేరీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యసేవలందించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట జీసీడీవో సూర్యకుమారి, ఎంఈవో బాలజీ, వైద్యాధికారి రాణప్రతాప్ తదితరులున్నారు.

4,368 ధ్రువీకరణపత్రాల పంపిణీ

కలెక్టర్ సుమిత్ కుమార్



సాక్షి,పాడేరు: జిల్లాలో పలు మండలాల పరిధిలోని 18 సచివాలయాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు విజయవంతమైనట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. 15,764 గృహాల్లో వలంటీర్లు సర్వేజరిపి, వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం 10,465 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారన్నారు. వీటిలో 59 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 4,368 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశామని, మిగిలిన 6,038 పత్రాలను రెండు రోజుల్లోగా ఆయా సచివాలయాలలో పంపిణీని పూర్తిచేస్తామని కలెక్టర్ తెలిపారు.

నేడు 22 సచివాలయాల పరిధిలో ..

జిల్లాలోని 22 సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.అడ్డతీగల మండలంలో డి.రామవరం,చింతపల్లి మండలంలో కుడుముసారి,ఎర్రబొమ్మలు,చింతూరు మండలంలో చదలవాడ,తుమ్మల,దేవీపట్నం మండలంలో సీహెచ్‌ఆర్ పేట, జీకే వీధి మండలంలో మొండిగెడ్డ, జర్రెల,గంగవరం మండలంలో కొత్తాడ,కొయ్యూరు మండలంలో బంగారంపేట-2,నడిమిపాలెం,కూనవరం మండలంలో కూనవరం,మారేడుమిల్లి మండలంలో మారేడుమిల్లి, ముంచంగిపుట్టు మండలంలో లక్ష్మిపేట,సుజనకోట,పెదబయలు మండలంలో గిన్నెలకోట,పర్రెడ,రాజవొమ్మంగి మండలంలో చికిలింత,జడ్డంగి, రంపచోడవరం మండలంలో బొలగుండ,రంపచోడవరం-2,వై.రామవరం మండలంలో గుర్తెడు సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు జరుగుతాయని,వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఆగని నిరసనలు

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం కూడా జిల్లాలో గ్రామ వలంటీర్లు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల మండిపాటు
- క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ర్యాలీలు, పోలీసులకు ఫిర్యాదు



వాలసీలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి



పెదబయలులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు



పెదబయలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

పెదబయలు: సేవభావంతో పనిచేస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు పెదబయలులో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఖబడ్దార్ పవన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్యం,ఆహారం, మందులు అందించడంతో కీలకంగా వ్యవహరించామని వారు చెప్పారు. తమ సేవలపై కనీస అవగాహన లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం చేస్తామన్నారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ర్యాలీగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి, పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో వలంటీర్ల మండల సంఘ నాయకులు వనల్బ కరుణాకరణ్, కూడ మనోహర్, కొమ్మ ప్రసాద్, చెండా కృష్ణబాబు,ఆనంద్, మండలంలోని వలంటీర్లు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు తగవు

అనంతగిరి: వలంటీర్ వ్యవస్థపై పవన్‌కల్యాణ్ నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ వలంటీర్లతో కలిసి మండలంలోని వాలసీ పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను చేరవేడయంలో ముఖ్యపాత్రను పోషిస్తూ, 1వ తేదీ ఉదయం ఇంటి తలుపుతట్టి మరీ వలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు విశేష సేవలందించారని గుర్తుచేశారు. ఇలాంటి గొప్ప వ్యవస్థపై ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్, సర్పంచ్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లంటే అంత చులకనా..



వలంటీర్లంటే పవన్‌కల్యాణ్‌కి అంత చులకనగా కనిపిస్తున్నారా.. గతంలోని టీడీపీ ప్రభుత్వం అరకొరగా ఇచ్చే పింఛన్‌ను పొందడానికి కూడా రోజుల తరబడి పంచాయతీ కార్యాలయం చుట్టూ వృద్ధులు తిరిగేవారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం హయాంలో వలంటీర్లు ప్రతీ నెలా ఒకటవ తేదీ తెల్లవారుజామునే పింఛన్ తీసుకువచ్చి ఇస్తున్నారు. వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదు. **– గంగులు ద్రౌపది, లబ్ధిదారు, రేఖపల్లి,వీఆర్‌పురం మండలం**

అనుచితంగా మాట్లాడడం తగదు



నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటరీ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు సంక్షేమ ఫలాలను, అభివృద్ధిని అందిస్తున్నారు. నేను వలంటరీగా ప్రజలకు సేవలందిస్తున్నందుకు గర్వపడుతున్నాను.

– కొట్టి ప్రియాంక, వలంటీర్ రేఖపల్లి

మతిభ్రమించినట్టుంది..



జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తరువాత అన్ని వర్గాల వారికీ సకాలంలో సేవలందుతున్నాయి. విశేష సేవలందిస్తున్న వారిపై విషం కక్కడం దారుణం. వలంటీర్ల వ్యవస్థపై పూర్తిగా అవగాహన లేకుండా పవన్ కల్యాణ్‌కు మాట్లాడుతున్నారు.

– కూడ మత్స్యకొండబాబు, ఉప సర్పంచ్ గోమంగి పంచాయతీ

ఉన్మాదిలా...



చిత్తశుద్ధితో సేవలందిస్తున్న వలంటీర్ల పట్ల పవన్ కల్యాణ్ ఉన్మాదిలా మాట్లాడుతున్నారు. వలంటీర్లలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారన్న కనీస జ్ఞానం లేకుండా వ్యాఖ్యలు చేయడం దారుణం. వలంటీర్లు కరోనా కాలంలో ప్రజలకు ఎంతో సహాకారం అందించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా పనిచేస్తుంటే పవన్ కల్యాణ్‌కు కనిపించకపోవడం దురదృష్టకరం.

– లోచలి సత్యవతి, గృహిణి, పెదబయలు

విస్తారంగా వర్షాలు



పాడేరు పట్టణంలో కురుస్తున్న వర్షం



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు/జి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి.కొన్ని చోట్ల ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తుండగా,కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారుగా పడుతున్నాయి. పాడేరులో ఉదయం నుంచి జల్లులు కురిశాయి.మిగిలిన ప్రాంతాల్లో జోరువానతో పంట భూముల్లో నీరు చేరింది. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని ప్రధాన గెడ్డలు,వాగుల్లో వరద నీటి ఉధృతి అధికమైంది. ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో గిరిజనులు నిమగ్నమయ్యారు.

జి.మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో రోడ్లు, పంటపొలాలు జలమయమయ్యాయి. పాడేరు-జి.మాడుగుల, చింతపల్లి, సుర్మతి, మద్దిగరువు, సొలభం, వంజరి, గెమ్మెలి రోడ్లపై రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదార్లు ఇబ్బందులకు గురయ్యారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

రాజవొమ్మంగిలో 24.4 మిల్లీమీటర్లు, అనంతగిరిలో 15.6, చింతూరులో 12.4. వి.ఆర్.పురంలో 12.4, పాడేరులో 8.4, పెదబయలులో 7.4, కొయ్యూరులో 7.2, అడ్డతీగలలో 6.8, అరకులోయలో 5.2, కూనవరంలో 4.8, డుంబ్రిగుడలో 4.6, వై.రామవరంలో 3.8, జి.మాడుగులలో 3.8, దేవీపట్నంలో 2.2, ముంచంగిపుట్టులో 2.2, మారేడుమిల్లిలో 1.6, హుకుంపేటలో 1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత



వాలసీలో పూజలు నిర్వహిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు

అనంతగిరి: మారుమూల గ్రామాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని వాలసీ పంచాయతీ కేంద్రంలోని టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో సమరతసేవ ఫౌండేషన్ సహకారంతో కోదండ రామలయం నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీతారామ, లక్ష్మణ, అంజనేయ స్వామి విగ్రహాప్రతిష్ట కార్యక్రమంలోని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలతో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

మారుమూల గ్రామాల్లో మరిన్ని ఆలయాలు నిర్మాణాలకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, సమరతసేవ ఫౌండేషన్ మహిళ సహా కన్వీనర్ జయలక్ష్మి, మండల ధర్మప్రచారకర్త వంశీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోల్తా పడ్డ వ్యాను స్వాధీనం

గంగవరం: కలప లోడుతో బోల్తా కొట్టిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఫోక్స్ పేట రేంజ్ అధికారి కరుణాకరన్ గురువారం రాత్రి తెలిపారు. కలప అక్రమ రవాణా నిర్మూలనకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రమాదానికి గురైన వ్యాన్ కలపను జిల్లా అటవీ శాఖ అధికారి నరేంద్ర ఆదేశాల మేరకు ఫోక్స్ పేట రేంజ్ అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు ఆయన వివరించారు.

ఉపమాక క్షేత్రం విశిష్టతలకు నిలయం

- వెంకన్న దర్శనంతో మధురానుభూతి
- ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావుకు పూర్ణకుంభ స్వాగతం

నక్కపల్లి: ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఉపమాక క్షేత్రాన్ని, ఆలయ విశిష్టతలను, స్థల పురాణాన్ని అర్చకులు చాగంటికి వివరించారు. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారి నిజరూపాన్ని చాగంటి మెట్ల మార్గం గుండా వెళ్లి దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయంలో దర్శనం అనంతరం చాగంటి భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఉపమాక క్షేత్రం విశిష్టతలకు నిలయమన్నారు. స్వామివారి దర్శనంతో తనకు ఎంతో మధురానుభూతి కలిగిందన్నారు. నిజరూపానికి నిత్యం అభిషేకం చేయడం, ఉత్సవమూర్తులకు ప్రధాన ఆలయాన్ని నిర్మించడం, అనేక సేవలు పూజామూర్తులకు నిర్వహించడం చాలా అరుదుగా ఉంటుందన్నారు. కొండపై ధ్రువమూర్తి (నిజరూపం) అశ్వారూఢుడై స్వామివారు లక్ష్మీసమేతుడై దర్శనమివ్వడం ఈ ప్రాంత ప్రజలకు వరమన్నారు. ఇంద్రియాలను అశ్వాలతో పోల్చుతారని, ఇంద్రియాలకు లోనై మనిషి పాడవుతున్నాడన్నారు. అటువంటి ఇంద్రియాలను అదుపులో పెట్టి మనిషికి ఉత్తమ గతులను ప్రసాదించేది శ్రీమన్నారాయణుడేనన్నారు. అవకాశం ఉన్నప్పుడు ఉపమాకలో భాగవత సప్తాహం నిర్వహించి, ప్రవచనాలు చెప్పాల్సిందిగా ఆలయ ప్రధానార్చకులు వరప్రసాద్ కోరారు. పరిశీలిస్తానని చాగంటి హామీ ఇచ్చారు. అర్చక స్వాములు భాగవతం సాయిగోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి సాగుతో ఆశాజనకంగా పంట దిగుబడులు

జి.మాడుగుల: మండలంలోని పుల్లలమామిడి గ్రామంలో గురువారం మత్స్యదేవత రైతు సాధికార సంస్థ అధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సంస్థ ఎఫ్‌పీవో సీఈవో ఐసరం హనుమంతరావు మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి సాగు పద్ధతులు అలవర్చుకోవాలన్నారు. వరి పొలం గట్లుపై కంది, బంతి, మొక్కజొన్న, ఆకుకూరలు, కూరగాయల పంటలు వేసుకోవాలని సూచించారు. వరిలో శ్రీవరి, లైన్ షోయింగ్ పద్ధతులను పాటించాలన్నారు. దీని వలన మొక్కకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగిలి పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. జి.మాడుగుల యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి మాట్లాడుతూ రాగులు, సామలు, కొర్రలు, గంటెలు, రాజ్‌మా, కాఫీ మిరియాలు పండించి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

హుండీ దొంగ అరెస్టు

గొలుగొండ : మండలంలో లింగంపేట నూకాలమ్మ తల్లి ఆలయంలో హుండీ చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకి తరలించడం జరిగిందని కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు. ఈనెల 11న తెల్లవారు సమయంలో వి. మాడుగుల మండలం వంతర్లపాలేనికి చెందిన పి.శ్రీనివాసరావు(43) నూకాలమ్మతల్లి ఆలయంలో హుండీ చోరీ చేసి సమీప గ్రామం అయిన రామచంద్రపురం వద్ద గ్రామస్తులకు దొరకడంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పూర్తి విచారణ చేసి గురువారం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి రెండు వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

17న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలు ఈ నెల 17న గుంటూరు, తెనాలి మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎల్.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 18 సంవత్సరాల్లోపు వయసున్న బాలురు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, సివిల్ సర్జన్ జారీ చేసిన ఫిట్‌నెస్ ధ్రువపత్రాలతోపాటు 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9032991543 నంబర్లో సంప్రదించాలన్నారు.

సరియా జలపాతం వద్ద పెద్దపులి సంచారం

- పర్యాటకులకు, గిరిజనులకు అటవీ శాఖ రేంజ్ అధికారి రవివర్మ హెచ్చరిక



సరియా జలపాతం పరిసరాలలో పర్యటించిన అటవీశాఖ అధికారులు

దేవరాపల్లి: అనంతగిరి, దేవరాపల్లి మండలాల సరిహద్దులో సరియా జలపాతం పరిసరాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి రవి వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ పులి సంచరిస్తున్నట్లు స్థానికులు అందించిన సమాచారం మేరకు జీనబాడు అటవీ సెక్షన్ అధికారి రామకృష్ణ తదితర సిబ్బంది సరియా జలపాతం పరిసరాల్లో పర్యటించారన్నారు. అక్కడ గుర్తించిన పాద ముద్రలు ఆధారంగా పెద్ద పులి సంచరించినట్లు నిర్ధారించామన్నారు. ఇటీవల జీనబాడు నుంచి దేవరాపల్లి మండలం బుచ్చెంపాలెం మీదుగా చీడికాడ మండలం కోనాం పరిసరాల్లో సంచరించిన పులి ప్రస్తుతం సరియా జలపాతానికి ఆనుకుని దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు పాద ముద్రలు గుర్తించామన్నారు. జలపాతం దగ్గరకు నీరు తాగేందుకు ఏ సమయంలోనైనా వచ్చే ప్రమాదం ఉందని, అక్కడకు వచ్చే పర్యాటకులు తమ పర్యటనలను కొన్ని రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాలాబు సహా పరిసర గిరిజన గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అడవుల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేశారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

అనకాపల్లిటౌన్ : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కశింకోట మండలం బయ్యవరం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి టీ దుకాణం వద్ద తిరుగుతుండగా అనుమానంతో తనిఖీ చేయగా వారి వద్ద 22 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులు చీడికాడ మండలంలో జైతవరం గ్రామానికి చెందిన మొల్లి వెంకుబాబు, బైలపూడి గ్రామానికి చెందిన గోకివాడ చెల్లుబాబు తమిళనాడుకు చెందిన మదన్‌కు ఇచ్చేందుకు గంజాయిని తీసుకు వెళుతున్నట్టు విచారణలో వెల్లడైందన్నారు. పలుమార్లు గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులపై పీడీ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే అనకాపల్లి పూడిమడక రహదారిలో ఏటీఎం చోరీకి పాల్పడిన వ్యక్తులను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎ.రవికుమార్, కశింకోట ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

22 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

చీడికాడ : కోనాం శివారు గుడివాడ వద్ద 22 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కోనాం శివారు గుడివాడ వద్ద మాటువేసి తనిఖీలు నిర్వహించగా అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంకు చెందిన జన్ని పార్థు, కిరసాని ఈశ్వరరావుతో పాటు తమిళనాడు కంచిపురానికి చెందిన శరణ్ అనే వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. ముగ్గురునీ అదుపులోకి తీసుకుని వారి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తూ...

నర్సీపట్నం : ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నర్సీపట్నం టౌన్ సీఐ ఎన్.గణేష్ తెలిపారు. సిబ్బందితో కలిసి చింతపల్లి రోడ్డులో గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 21.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. గంజాయి తరలిస్తున్న కేరళ రాష్ట్రానికి చెందిన అల్బిన్, కన్నన్, ఆదర్శ్‌తో పాటు వీరికి గంజాయి విక్రయించిన చింతపల్లికి చెందిన రవిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

- జీవో నంబర్ 301, 388 భూములకు కన్వేయన్స్ డీడీ అమలు
- 100 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్: జేసీ విశ్వనాథన్



మహారాణిపేట: జీవో నంబర్ 301, 388 ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన భూములకు కన్వేయన్స్ డీడ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరణ చేసి.. అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా, మార్కెట్ విలువ చెల్లింపుపై గతంలో క్రమబద్ధీకరణ పట్టాలు అందజేశామన్నారు. జిల్లాలో జీవో నంబర్ 388 కింద 8,401 దరఖాస్తుల్లో 5,890 మంది క్రమబద్ధీకరణ మొత్తం చెల్లించినట్లు చెప్పారు. 5,890 మందిలో 3,435 కేసులు 100 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయని.. వీటికి లబ్ధిదారులు ఎటువంటి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 100 చదరపు గజాల పైన ఉన్న 2,455 మంది లబ్ధిదారులు గతంలో చెల్లించిన క్రమబద్ధీకరణ ఖర్చుపై 7.5 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాలన్నారు. జీవో నంబర్ 301 ద్వారా 7,441 దరఖాస్తులు అందాయని, వీటిలో 7,228 దరఖాస్తులకు సంబంధించి క్రమబద్ధీకరణ మొత్తం చెల్లించినట్లు చెప్పారు. వినియోగదారుల రుసుం రూ.500 అందరూ చెల్లించాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం నుంచి షెడ్యూల్ ప్రకారం లబ్ధిదారులందరికీ కన్వేయన్స్ డీడ్ అందజేస్తామని.. సంబంధిత తహసీల్దార్లు ఈ ప్రక్రియ అమలు చేస్తారన్నారు. టైటిల్ డీడ్ పట్టాలు పూర్తి అనుభవంతో రిజిస్ట్రేషన్ హక్కులు కలిగి ఉంటాయని.. అవకాశాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపకారవేతనాలు



ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

అనకాపల్లిటౌన్: అఖిల భారత సాంకేతిక విద్యామండలి(న్యూఢిల్లీ) ద్వారా ప్రగతి సాక్ష్యం ఉపకార వేతనాలకు అర్హత సాధించిన రేబాక పాలిటెక్నిక్ విద్యార్థులు 16 మందిని ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు గురువారం అభినందించారు. ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లపాటు రూ.లక్షా 50 వేలు ఉపకారవేతనం అందుతుందన్నారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు విద్య, ఉపాధి అవసరాలకు మాత్రమే దానిని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడిగంజి మీద పడి బాలుడికి తీవ్ర గాయాలు

మునగపాక: గణపర్తి గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు రోహన్ కృష్ణపై వేడి గంజి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రాత్రి రోహన్ కృష్ణ తల్లి లక్ష్మి అన్నం వండే క్రమంలో వేడిగంజిని వంట గదిలో ఉంచింది. పక్కనున్న గదిలోకి వెళ్లిన సమయంలో రోహన్ కృష్ణ వంటగదిలో వేడి గంజి ఉన్న పాత్రను తాకడంతో అతని శరీరంపై పడింది. బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు విశాఖలోని కిమ్స్ ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు.

పాఠశాలలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు



ప్రమాదంలో కాలిపోయిన వంటగది తలుపులు

మాకవరపాలెం : పాఠశాలలో గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగిన ఘటన కలకలం సృష్టించింది. గిడుతూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు గురువారం వంటలు ప్రారంభించగా గ్యాస్ బండ పైపు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వంట గదిలో సామగ్రితోపాటు గది తలుపులు కాలిపోయాయి. వెంటనే ఉపాధ్యాయులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వాహనంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కాలువలోకి ఒరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేట్ బస్సు

యలమంచిలి : నిద్రమత్తులో డ్రైవర్ అజాగ్రత్త వల్ల ప్రైవేట్ ట్రావెల్ బస్సు రోడ్డు పక్క కాలువలోకి దూసుకుపోయింది. రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. విజయవాడకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు విశాఖపట్నం వెళుతుండగా గురువారం ఉదయం యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే సమీపంలో రోడ్డు పక్క కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సులోని నలుగురు ప్రయాణికులు, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

ఆటో ఢీకొట్టి ఒకరికి గాయాలు

చోడవరం రూరల్ : స్కూటీతో రోడ్డు పక్కన ఆగి ఉన్న వ్యక్తిని వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో అతను గాయాలపాలయ్యాడు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అందించిన వివరాలివి. అంబేరుపురం గ్రామానికి చెందిన ఇల్లపు నూకరాజు(40) ఈ నెల 8న ఉదయం 8 గంటల సమయంలో తన ఎలక్ట్రికల్ స్కూటీపై మంచినీటిని తీసుకురావడానికి ముద్దుర్తి గ్రామం వైపు వెళ్లాడు. మార్గమధ్యంలో మూత్ర విసర్జన నిమిత్తం రోడ్డు పక్కన ఆపి ఉండగా ఏపి 39 యుహెచ్ 1531 నంబరు గల ఆటో మితిమీరిన వేగంతో వెనుకగా వచ్చి ఢీకొట్టడంతో నూకరాజు కిందపడిపోయాడు. ఆటో అతడి మెడ, ఛాతీ మీదుగా దూసుకుపోయింది. దీంతో బాధితుడి కాలర్‌బోను ఫ్రాక్చర్ కాగా, చిన్నపాటి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేరిన మీదట తమకు నూకరాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు సీఐ తెలిపారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు, స్ప్రింకర్లు



ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రహీం

మహారాణిపేట: రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు అందజేస్తున్నట్లు ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) డైరెక్టర్ ఎం.ఎ.రహీం తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూమి గల రైతులకు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాలు పైబడి భూమి గల రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. అలాగే ఐదు ఎకరాల భూమి గల రైతులకు 55 శాతం రాయితీ, ఐదు ఎకరాల పైబడి భూమి గల రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింకర్ సెట్‌లు అందిస్తామన్నారు. బోరు బావి ఉన్న ప్రతీ రైతు తక్కువ నీటితో, అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తి సాధించాలనుకుంటే సూక్ష్మ సేద్యం పరికరాలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో 300 హెక్టర్లలో సూక్ష్మసేద్యం చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు చెప్పారు. రైతులు ఆధార్ జిరాక్స్, సాగు భూమి 1బీ, బ్యాంక్ పాస్ బుక్ కాపీ, ఫోన్ నంబర్ తదితర వివరాలతో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏడేళ్ల కిందట రాయితీపై డ్రిప్ పరికరాలు తీసుకున్న రైతులు.. ఈ ఏడాది కూడా పరికరాలు పొందవచ్చని వివరించారు.

15న బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మధురవాడ: అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 15న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ మహంతి, జి.భూషణరావు చెప్పారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లోని బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. 1 జనవరి 2010 తర్వాత పుట్టినవారు మాత్రమే అర్హులని చెప్పారు. ఆసక్తి గల బాలబాలికలు ఆధార్ కార్డు, పుట్టి తేదీ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 89196 49048, 99667 53209 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

స్పేసెస్ డిగ్రీ కాలేజిలో క్యాంపస్ సెలక్షన్స్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 15న 'ది ప్లేస్మెంట్ పార్క్ విశాఖపట్నం' వారితో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. 2019, 2020, 2021, 2022, 2023 విద్యా సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు తమ బయొడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని, ఎంపిక పక్రియలో ముందుగా రాత పరీక్ష, తదుపరి ఇంటర్వ్యూ ఉంటుందని ప్రిన్సిపాల్ వీర్రాజు తెలిపారు.

క్రైమ్ థ్రిల్లర్‌గా కొత్త చిత్రం

బీచ్‌రోడ్డు: క్రైమ్ థ్రిల్లర్ కథతో త్వరలో ప్రొడక్షన్ నంబర్ వన్‌గా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు నిర్మాత వంగా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు చిత్ర యూనిట్ గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయి నటుడు జాన్ రీగన్, హీరోయిన్ రేఖాబోజ్ జంటగా ఈ చిత్రం షూటింగ్‌ను ఆగస్టులో ప్రారంభిస్తామన్నారు. విశాఖపట్నంలోనే ఎక్కువ భాగం చిత్రీకరిస్తామని వెల్లడించారు. హీరో జాన్ రీగన్ మాట్లాడుతూ తన మొదటి తెలుగు సినిమా క్రైం అండ్ థ్రిల్లర్ కథ కావడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు నేర్చుకుని టాలీవుడ్‌లో మరిన్ని చిత్రాల్లో నటించాలని ఉందన్నారు.

నేడు, రేపు కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు (డీఆర్కే కప్) నిర్వహిస్తున్నట్టు నిజిసో టోకాన్(ఎన్ఎస్ఎస్‌కేఏఐ) స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ప్రతినిధి ఎస్.పి.ఎం.డి.నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను 14న ఉదయం 9 గంటలకు పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించనున్నట్లు పేర్కొ న్నారు. ఐదు రాష్ట్రాల క్రీడాకారులు తలపడతారన్నారు.

'స్లమ్ డాగ్ హస్బెండ్' నవ్విస్తాడు



మాట్లాడుతున్న హీరో హీరోయిన్లు

బీచ్‌రోడ్డు: స్లమ్ డాగ్ హస్బెండ్ చిత్రం ప్రేక్షకులు చూస్తున్నంత సేపు నవ్వుతూ.. ఎంతో ఎంజాయ్ చేస్తారని ఆ సినిమా హీరో సంజయ్‌రావు అన్నారు. 'స్లమ్ డాగ్ హస్బెండ్'ప్రమోషన్‌లో భాగంగా గురువారం బీచ్‌రోడ్‌లో సినిమా బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో సంజయ్ మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోకు జాతకాలంటే ఎంతో విశ్వాసం అని.. జాతకంలో దోషం ఉండటంతో చెట్టు లేదా కుక్కను వివాహం చేసుకోమని ఓ జ్యోతిష్యుడు చెబుతాడన్నారు. దీంతో హీరో కుక్కను వివాహం చేసుకుంటాడని, అక్కడి నుంచి కథ ఎన్నో మలుపులు తిరుగుతుందన్నారు. హీరోయిన్ ప్రణవి మాట్లాడుతూ తాను స్లమ్‌లో నివసించే మౌనిక అనే పాత్రలో నటించినట్లు చెప్పారు. ఈ నెల 21న ఈ సినిమా విడుదలవుతుందని, తెలుగు ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరారు. హాస్యనటుడు యాదమరాజు మాట్లాడుతూ ఈ చిత్రంలో సప్తగిరి, తన కామెడీ అద్భుతంగా ఉంటుందన్నారు. ఈ చిత్రానికి ఎ.ఆర్.శ్రీధర్ దర్శకత్వం వహించగా.. అప్పిరెడ్డి నిర్మాతగా వ్యవహరించారు.

లోవోల్టేజ్ నియంత్రణకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్



ఇండోర్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేంద్రనాథ్

నర్సీపట్నం: విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్‌ను నియంత్రించేందుకు ఎక్కడికక్కడ ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. 33/11 కె.వి ఇండోర్ సబ్ స్టేషన్‌లో రూ.68 లక్షలతో ఏర్పాటు చేసిన 5 ఎం.వి.ఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఇండోర్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెరిగి లోవోల్టేజ్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. దీంతో 26 వేల మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇదే తరహా ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లాలో పలు చోట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అకౌంట్స్ సిబ్బందితో సమీక్షించారు. వినియోగదారులకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. వారు కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. రైతులు డబ్బులు చెల్లించిన తర్వాత నిర్దేశిత సమయంలో వ్యవసాయ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యానందం ఉన్నారు.